# నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్

I హైదరాబాద్, గురువారం 5 డిసెంబర్ 2024 | HYDERABAD




ఆశా వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు రూ. 18 వేలు వేతనం చెల్లించాలని (సీఐటీయూ) ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి రేవతి కళ్యాణి అన్నారు. మేడ్చల్ -మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ వద్ద రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం ఆశా వర్కర్లు ధర్నా నిర్వహించారు. అనంతరం అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. నిరసనలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు, కార్యదర్శి అశోక్, ఉన్నికృష్ణ ,ఆశా వర్కర్ల యూనియన్ నాయకురాళ్లు హేమలత, జయప్రద, రాధా,యాదమ్మ, వాసంతి, అనిత,కోవలత, సబియ, రాణి, రాజలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. -కలెక్టరేట్, డిసెంబర్ 4



ఎల్బీనగర్ సర్కిల్ ఉప కమిషనర్ సేవా నేస్లావత్ పని ఒత్తిడితో ఇబ్బంది పెడుతున్నారని ఆరోపిస్తూ ఉద్యోగులు, సిబ్బంది బీఎంఎస్ ఆధ్వర్యంలో బుధవారం ఆందోళన నిర్వహించారు. బీఎంఎస్ ఉద్యోగుల సంఘం నాయకులు శ్రీధర్, కె. శంకర్ తదితరుల నేతృత్వంలో మూడు సర్కిళ్ల ఉద్యోగులు, సిబ్బంది ధర్నా నిర్వహించారు. ఉప కమిషనర్ సేవా ఇస్లావత్ పని ఒత్తిడి కారణంగానే టాక్స్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రాజు ప్రమాదానికి గురయ్యారని వారు ఆరోపించారు. అనంతరం ఎల్బీనగర్ ఉప కమిషనర్ సేవా నేస్లావత్ ధర్నా చేస్తున్న సిబ్బందిని తన చాంబర్‌లోకి పిలిచి మాట్లాడారు. పని ఒత్తిడి లేకుండా సమయానుకూలంగా విధులు నిర్వహించేలా చూస్తామని పేర్కొన్నట్లు ఉద్యోగులు, సిబ్బంది తెలిపారు. - ఎల్బీనగర్


## పారిశుధ్య కార్మికుల పనివేళల్లో మార్పు



సిటీబ్యూరో, డిసెంబర్ 4 (నమస్తే తెలంగాణ): జీహెచ్ఎంసీలో పారిశుధ్య కార్మికుల పనివేళల్లో మార్పులు తేస్తూ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. విధుల హాజరు ఉదయం 5 నుంచి 6 గంటల వరకు ఉండగా, తాజాగా 6 నుంచి 7 గంటల వరకు పెంచారు. ఔట్ టైం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 2 వరకు పనివేళలను నిర్ణయించారు. చలి తీవ్రత దృష్ట్యా కార్మికుల విజ్ఞప్తి మేరకు గతంలో కంటే గంట ముందుకు జరిపారు.

## కంపించిన నగరం..భయం..భయం

### రిక్టర్ స్కేల్‌పై 5.3గా నమోదు



సిటీబ్యూరో : గోదావరి పరీవాహక ప్రాంతంలో ఉన్న ములుగు జిల్లాకు సమీపంలో ఏర్పడిన భూకంప తరంగాలు నగరం వరకు విస్తరించాయి. భూమి ఉపరితలం నుంచి 40 కిలోమీటర్ల లోతున ఏర్పడిన భూకంప కేంద్రంతో నగరంలోని యూసుఫ్‌గూడ, రహ్మత్ నగర్, బోరబండ, ఇబ్రహీంపట్నంతో పాటు, మరికొన్ని ప్రాంతాల్లోనూ భూమి కంపించినట్లు సిటీ జనాలు పేర్కొన్నారు. ఉదయం 7.27 గంటల ప్రాంతంలో ములుగు జిల్లాకు 200 కిలోమీటర్ల దూరంలో ఉండే హైదరాబాద్ వరకు ప్రకంపనలు విస్తరించింది. ఏపీలోని పలు జిల్లాలు, తెలంగాణకు సరిహద్దుగా ఉన్న మహారాష్ట్ర జిల్లాల్లోనూ భూమి కంపించినట్లు స్థానికులు తెలిపారు. గోదావరి పరివాహక ప్రాంతాల్లో భూమి అడుగున ఉండే పొరలు తరచూ సర్దుబాట్లకు గురవుతుంటాయని అందుకే భూకంపాలు వస్తాయని సైంటిస్టులు వివరించారు. భూమిలో ప్రధానంగా 16 రకాల పలకలు ఉంటాయి.. నిత్యం వివిధ దిశల్లో ప్రయాణిస్తుంటాయి. భారతదేశం ఉన్న ఫలకం ఉత్తర దిశలో ఏటా 5-6 సెం.మీటర్లు పయనించి ఆసియా పలకలతో ఢీకొంటుందని పరిశోధకులు చెబుతున్నారు. ఈ క్రమంలో ఏర్పడే ఒత్తిడి కారణంగా భూమి లోపల పొరల మధ్య కదలికలు వచ్చి భూకంపం సంభవిస్తుందన్నారు. తరంగాలు చుట్టూరా వందల కిలోమీటర్ల విస్తరించడంతో ఇతర ప్రాంతాల్లోనూ భూమి కంపిస్తుందని పేర్కొన్నారు. 55 ఏండ్ల కిందట భద్రాచలంలో రిక్టర్ స్కేల్‌పై 5.7 తీవ్రత కలిగిన ప్రకంపనలు రాగా, తాజాగా 5.3 మ్యాగ్నిట్యూడ్ భూకంపం రెండో అతిపెద్దదిగా పరిశోధకులు పేర్కొన్నారు. అయితే తెలంగాణకు భూకంపాలతో వచ్చే ప్రమాదం తక్కువేనని, ఈ ప్రాంతం సెస్మిక్ జోన్-2లో ఉన్నట్లు చెప్పారు.



## • ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు

ఆర్కేపురం, డిసెంబర్ 4 : ఎల్బీనగర్ ట్రాఫిక్ సీఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఎన్టీఆర్‌నగర్ వ్యవసాయ మార్కెట్ ముందు విజయవాడ-హైదరాబాద్ ప్రధాన జాతీయ రహదారికి, సర్వీస్ రోడ్డుకి ఇరువైపులా ట్రాఫిక్‌కు అంతరాయంగా ఉన్న ఆక్రమణల తొలగింపు ప్రక్రియ రెండో రోజు కూడా కొనసాగింది. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పండ్ల వ్యాపారం చేసుకునే దళారులు రోజు వారీ కూలీలను పెట్టి మరీ రోడ్డుకు ఇరువైపులా ఒక్కొక్కరూ మూడు నుంచి నాలుగు తోపుడు బండ్లు, ఆటోల్లో పండ్లు, కూరగాయలు పెట్టి అమ్ముతూ నిత్యం ట్రాఫిక్ అంతరాయం కలిగిస్తున్నారని చెప్పారు. నిబంధనలకు విరుద్ధంగా ఫుట్‌పాత్‌లను అడ్డాగా చేసుకుని ట్రాఫిక్ అంతరాయం కలిగిస్తే చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ డ్రైవ్‌లో ట్రాఫిక్ అదనపు సీఐ నాగరాజు, ఎస్ఐ రవికుమార్, సిబ్బంది ఉన్నారు.



ఉదయం .. మంచు కురిసే వేళ లో సాగర తీరం

# కాంగ్రెస్, బీజేపీలు దోస్తులు

## తెలంగాణ ప్రజలను మోసం చేస్తున్నాయి.. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

మెహిదీపట్నం, డిసెంబర్ 4: కాంగ్రెస్, బీజేపీలు దోస్తులని, తెలంగాణ ప్రజలను మోసం చేస్తున్నాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. తెలంగాణ ప్రజల కోసం నిరంతరం పోరాడుతున్నది బీఆర్ఎస్ ఒక్కటేనని, బీఆర్ఎస్‌ను రాష్ట్రం నుంచి దూరం చేయాలనుకోవడం కల్ల అని చెప్పారు. తెలంగాణ రాష్ట్రంలో మైనార్టీల సంక్షేమం కోసం సీఎంగా కేసీఆర్ ఎంతో కృషి చేశారని గుర్తు చేశారు. బుధవారం రాత్రి మాసబ్ ట్యాంక్ ఖాజా మెన్షన్ ఫంక్షన్ హాల్‌లో బీఆర్ఎస్ మైనార్టీ నాయకులు ముఖీత్ చంద్ దీక్షా దివస్‌లో భాగంగా ముషాయిరా ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ హోం మంత్రి మహ్మద్ మహమూద్ అలీ, ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ సలీం, ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో ప్రజలను మోసపూరిత మాటలతో మభ్య పెట్టి అధికారంలోకి వచ్చిందన్నారు. నగరంలో మూసీ నది పరీవాహకంలో ఇండ్లు కోల్పోతున్న పేదలకు తాము అండగా ఉంటామని చెప్పారు. ప్రజలు తిరగబడి కాంగ్రెస్‌ను ఖతం పట్టించడం ఖాయం అని, ఆ రోజు దగ్గరలోనే ఉందన్నారు. కేంద్రంలో రాహుల్ గాంధీ విమర్శిస్తున్న వారిని ,ఇక్కడ రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి ఆదరిస్తున్నారని విమర్శించారు. తెలంగాణ సాధన కోసం ఎంత పోరాడామో.. అదే విధంగా ఇప్పుడు కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా ప్రజల కోసం తాము ఎల్లప్పుడూ పోరాడుతామని స్పష్టం చేశారు. మైనార్టీ నాయకులు కన్వీనర్ ముఖీత్ చంద్ పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, చిత్రంలో ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి, ఎమ్మెల్సీ మహమూద్ అలీ, బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ తదితరులు



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, చిత్రంలో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

# ప్రజా పాలనా?.. ఫ్యాక్షనిస్టుల పాలనా..?

## కాంగ్రెస్ సర్కారుపై కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ఆగ్రహం

దుండిగల్: రాష్ట్రంలో ప్రస్తుతం ప్రజాపాలన నడుస్తుందా...? ఫ్యాక్షనిస్టుల పాలన నడుస్తుందా...? తెలియడం లేదని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ అన్నారు. మాజీ మంత్రి హరీశ్‌రావుపై ప్రభుత్వం అక్రమ కేసులు నమోదు చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గండిమైసమ్మలోని మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో బుధవారం ఎమ్మెల్యే వివేకానంద్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, బీఆర్ఎస్ నేత రాగిడి లక్ష్మారెడ్డితో కలిసి ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిందని, సంవత్సర కాలంలో 420 అబద్ధపు హామీలు, ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని చెప్పి ప్రజలను మోసం చేశారన్నారు. రూ.2 లక్షల రైతు రుణ మాఫీ చేస్తామన్నారని, కానీ ఏడాది పూర్తయినా.. ఇచ్చిన 420 హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయమని ప్రశ్నిస్తే, రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తప్పుడు కేసులు పెడుతున్నదని, ఎలాంటి ఆధారాలు లేకుండా మాజీ మంత్రి హరీశ్‌రావుపై కేసులు ఎలా నమోదు చేస్తారని ప్రశ్నించారు. ఎఫ్ఐఆర్ నమోదు చేసే ముందు అవతలి వ్యక్తి ఎవరూ? వారి చరిత్ర ఏమిటీ, విశ్వసనీయత ఏమిటీ అని పోలీసులు సైతం ఆలోచించాలన్నారు. 'చక్రధర్‌గౌడ్ అనే ఓ చీటర్ వెళ్లి కేసు పెడితే.. ఆధారాలు లేకున్నా హరీశ్‌రావు వంటి వ్యక్తిపై కేసు నమోదు చేస్తారా..? ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలు అమలు చేయాలని ప్రశ్నిస్తే.. తప్పుడు కేసులు పెడతారా...? మేము కూడా కేసులు పెడతాం.. పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేస్తారా? కొడంగల్ నియోజకవర్గంలోని కొండారెడ్డిపల్లిలో మాజీ సర్పంచ్ సాయిరెడ్డి తన చావుకు సీఎం రేవంత్‌రెడ్డి, ఆయన సోదరులే కారణం అని నోట్ రాసిపెట్టి ఆత్మహత్య చేసుకున్నాడు. కానీ పోలీసులు ఇప్పటి వరకు వారిపై ఎఫ్ఐఆర్ ఎందుకు నమోదు చేయలేదు. లగచర్లలో గిరిజనులను ఇబ్బందులకు గురిచేసిన ముఖ్యమంత్రి రేవంత్ సోదరుడు తిరుపతిరెడ్డిపై పోలీసులు ఎందుకు కేసు నమోదు చేయలేదు. సీఎం రేవంత్‌రెడ్డి కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులపై బుల్డోజర్లు ఎక్కిస్తాం.. అని అంటున్నా పోలీసులు కేసులు ఎందుకు నమోదు చేయడం లేదు'...? అని ప్రశ్నించారు.

### తప్పుడు కేసులు పెడుతున్నారు...

'100 రోజుల్లో హామీలన్నీ అమలు చేస్తామని చెప్పింది ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డే కదా.. రైతు రుణమాఫీ, రైతుబంధు, వృద్ధులకు, దివ్యాంగులకు పింఛన్లు, మహిళలకు రూ. 25వేలు, 2లక్షల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చారు. అవన్నీ ఎందుకు ఇవ్వడం లేదని మాజీ మంత్రి హరీశ్ ప్రశ్నిస్తే.. వాటికి సమాధానం చెప్పలేక, తప్పుడు కేసులు పెడుతున్నారు. కోర్టు ఎలాంటి ఆదేశాలు ఇవ్వకుండానే సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలతోనే మాజీ మంత్రి హరీశ్‌రావుపై కేసు నమోదు చేశారు. బీఆర్ఎస్‌ను ఎదుర్కోలేక, ఇచ్చిన హామీలు అమలు చేయలేక, ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించలేక ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చతికిల పడిపోయారు. బీఆర్ఎస్ నేతల గొంతు నొక్కాలని చూస్తే ఊరుకునే ప్రసక్తేలేదు' అని ఎమ్మెల్యే వివేకానంద్ హెచ్చరించారు. ఫోన్ ట్యాపింగ్‌కు హరీశ్‌రావుకు ఎలాంటి సంబంధంలేదని, కేవలం ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే.. సమాధానం చెప్పలేకనే.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారన్నారు. తక్షణమే మాజీ మంత్రి హరీశ్‌రావుపై పెట్టిన బూటకపు కేసును ఉపసంహరించుకోవాలన్నారు.



## కాంగ్రెస్‌వి బూటకపు మాటలు..

### ఎమ్మెల్యే మాధవరం సమక్షంలో 50 మంది కాంగ్రెస్ నేతల చేరిక

కేపీహెచ్‌బీ కాలనీ, డిసెంబర్ 4 : శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీకి భారీ షాక్ తగిలింది. హైదర్‌నగర్ డివిజన్‌కు చెందిన కాంగ్రెస్ నేత, ఉద్యమకారుడు సిద్దం శ్రీకాంత్, డివిజన్ మాజీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణలతో పాటు 50 మంది కాంగ్రెస్ సీనియర్ నాయకులు... ఆ పార్టీకి రాజీనామా చేసి, కూకట్‌పల్లి ఎమ్మెల్యే, శేరిలింగంపల్లి బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి మాధవరం కృష్ణారావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణారావు మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ నేతలు ఎన్నికలప్పుడు అబద్ధపు హామీలు, బూటకపు మాటలు ప్రజలు నమ్మి మోసపోయారని, ఏడాది కాలంగా కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుకు విసుగు చెందిన ప్రజలు, ఆ పార్టీ నేతలు తిరిగి బీఆర్ఎస్‌లో చేరుతున్నారన్నారు. నమ్మించి మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి ప్రజలే బుద్ధి చెప్పే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్నారు. ప్రభుత్వం ఏర్పడి సంవత్సర కాలమైనా ఇప్పటివరకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయలేదని, పేదలకు పింఛన్లు పెంచలేదని, రైతుబంధు ఇవ్వలేదని, పేదింటి ఆడబిడ్డలకు కల్యాణలక్ష్మితో తులం బంగారం ఇవ్వలేదని, ఇలా ఎన్నో హామీలను మర్చిపోయారన్నారు. ఏడాది పూర్తైందని కాంగ్రెస్ ప్రభుత్వం సంబురాలు చేసుకోవడం బాధాకరమన్నారు. ప్రజలకు ఏం మేలు చేశారని, సంక్షేమ ఫలాలు ఇచ్చారని సంబురాలు చేసుకుంటున్నారో చెప్పాలని ప్రశ్నించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ రంగారావు, ఎర్రబెల్లి సతీశ్‌రావు, పెద్ద భాస్కర్, నర్సింగరావు, విష్ణు, రషీద్, రాము, షాదుల్లా, రవీందర్, బాలరాజు యాదవ్, రబ్బానీ, నరేందర్‌రెడ్డి, సాజిత్, రాంబాబు, వెంకట్‌రావు, షరీఫ్, హమీద్, సత్తార్ తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ విభాగంలో ట్రాన్స్‌జెండర్లు

సిటీబ్యూరో, డిసెంబర్ 4 (నమస్తే తెలంగాణ): పోలీసు శాఖలోని ట్రాఫిక్ విభాగంలో ట్రాన్స్‌జెండర్ల భర్తీ ప్రక్రియ షురువైంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు నగరంలో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు ట్రాఫిక్ అసిస్టెంట్లుగా ట్రాన్స్‌జెండర్ల ఎంపిక ప్రక్రియను బుధవారం గోషామహల్‌లోని పోలీస్ స్టేడియంలో నగర పోలీసు కమిషనర్ సీవీ. ఆనంద్ ప్రారంభించారు. సోషల్ వెల్ఫేర్ శాఖ ఇచ్చిన అభ్యర్థుల జాబితా ప్రకారం మొత్తం 58 మంది ట్రాన్స్‌జెండర్లకు ఫిజికల్ ఈవెంట్ నిర్వహించగా, అందులో 44 మంది ఎంపికయ్యారు. సీపీ సీవీ ఆనంద్ మాట్లాడుతూ మీ కమ్యూనిటీకి ఒక రోల్ మాడల్ కావాలంటూ.. ట్రాఫిక్ అసిస్టెంట్లుగా ఎంపికైన ట్రాన్స్‌జెండర్లకు సూచించారు. సమాజంలో ఒక గుర్తింపు ఇవ్వడానికి ప్రభుత్వం కల్పించిన ఈ సదావకాశాన్ని వినియోగించుకొని, పోలీసు శాఖకు మంచి పేరు తేవాలన్నారు.



ట్రాన్స్‌జెండర్లకు ఫిజికల్ ఈవెంట్‌ను ప్రారంభిస్తున్న నగర సీపీ సీవీ ఆనంద్